కథ

ట్రాన్స్‌ఫర్ షెడ్యూల్ రాగానే, ఆన్‌లైన్‌లో 'యూపీఎస్ కొండాపూర్' మొదటి ఆప్షన్ పెట్టుకుంటే.. తెలిసిన వాళ్లందరూ వద్దన్నారు. కారణాలు అడిగితే ఒక్కో మిత్రుడు ఒక్కో సమస్య గురించి చెప్పాడు. అందరి సారాంశం ఏమిటంటే, ఆ పాఠశాల గంగెద్దుల కాలనీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. గంగెద్దుల వాళ్ల పిల్లలు తప్ప వేరే పిల్లలు ఉండరు. వాళ్లంతా చాలా వెనుకబడి ఉంటారు. తల్లిదండ్రులకు చదువు పట్ల ఏమాత్రం ఆసక్తి, అవగాహన ఉండదు. విద్యార్థులకు క్రమశిక్షణ బొత్తిగా తెలియదు. విపరీతమైన అల్లరి. తల్లిదండ్రులు సంవత్సరంలో సగం రోజులు వేరే ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల, పిల్లలూ బడికి సరిగా రారు. బడి బడిలాగా ఉండదు. బంజరుదొడ్డిలాగా ఉంటుంది.

ఇలా అందరూ ప్రతికూలమైన విషయాలే చెప్పారు.

కానీ, నా ఇరవై ఐదు సంవత్సరాల అనుభవంలో అననుకూలంగా ఉన్న పరిస్థితులను ఎదుర్కోవడం నాకు కొత్తేం కాదు. ప్రజలతో సంబంధాలు పెంచుకొని, విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు విద్యా నైపుణ్యాల పెంపుదలలో గుణాత్మకమైన మార్పులు తేగలిగాను. గ్రామీణ ప్రాంతాలలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలలో కొన్నిటిని మార్చగలిగాను. నా సేవలకు గుర్తింపుగా రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులనూ తీసుకున్నాను. ఊహించినట్లుగానే కొండాపూర్‌కు బదిలీ అయి ఉత్తర్వులు తీసుకొని పాఠశాలలో జాయిన్ కావడానికి వెళ్లాను. నన్ను చూడగానే పిల్లలు..

''కొత్త సారచ్చిండు'' అంటూ కేకలు వేస్తూ, ఒక బెంచీ మీదినుంచి మరొక బెంచీ పైకి దుంకసాగారు.

పిల్లలు ఇంత అదుపుతప్పి ఉండటం చూసిన మొదటి అనుభవమే నన్ను బెంబేలెత్తించింది.

''చదువు కంటే ముందు వీళ్లలో క్రమశిక్షణ నేర్పాలి'' అని స్టాఫ్ మీటింగులో అంటే..

''వీళ్ల జీవితాల్లోనే క్రమశిక్షణ లేదు సర్! వీళ్లు అంతే.. వీళ్ల తల్లిదండ్రులూ అంతే! ముందుముందు మీకే తెలుస్తుంది'' అంది నా తరువాత సీనియరైన రమ్య మేడం.

''లేదమ్మా! ప్రయత్నం చేద్దాం. దేనినైనా పాజిటివ్‌గా ఆలోచిస్తే పరిష్కారం దొరక్కపోదు''..

నా మాటలకు ముసిముసి నవ్వులు నవ్విన ఆ టీచర్ మనోగతం నాకర్థం కాలేదు.

* * *

ముందుగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలన్న సంకల్పంతో బడివేళల తరువాత టీచర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రైవేట్‌కు వెళ్లే పిల్లల్ని మా స్కూలులో చేర్పించమని అడిగితే.. అందరిదీ ఒకటే మాట.

''గంగెద్దుల వాళ్ల పిల్లలతో కలిసి చదువుకుంటే ఆ జంగ్లీ లెక్కలు మా పిల్లలకు కూడా అలవాటవుతాయి. మేం అసలే పంపం''.

నాకు ఆశ్చర్యం వేసింది. ఇది కూడా సమాజం వాళ్ల పట్ల చూపిస్తున్న ఒక వివక్షనే. పాఠశాల అంటే ఏ ఆధిపత్యాలు, అంతరాలకు చోటులేని ఒక విజ్ఞాన, వికాస కేంద్రంగా ఉండాలి. ఈ పరిస్థితిలో మార్పు తేవాలంటే వారి సాంస్కృతిక మూలాలను అధ్యయనం చేయాలని నిశ్చయించుకున్నాను.

* * *

పాఠశాలకు సరిగా రాని విద్యార్థులను కలవడానికి వాళ్ల కాలనీలోకి వెళ్తే, వాళ్ల జీవన విధానాన్ని అంచనా వేయొచ్చని అనుకున్నాను. అక్కడికెళ్లి చూస్తే.. ఇండ్లన్నీ

# ఒక దీపం వెలిగింది

గాజోజు నాగభూషణం
98854 62052

